# అనాహూత

అబ్బితే వంకన అబ్బకపోతే భుజాన పెట్టుకొని అవలీలగా ఎత్తుకొని పోగలిగిన ఆ చెక్క పెట్టెను రైలు పెట్టెలో పెట్టడానికి కూలీ అయిదు రూపాయలడిగే సరికి ఆ ఎర్ర చొక్కా వైపు ఎగాదిగా చూస్తూ ఆటో వాడికి డబ్బులివ్వడం కూడా మరచిపోయినాడు ప్రసాద్!

ఆటో వాడి సహనం అయిదు నిముషాలు బతికింది.



## పులికంటి కృష్ణారెడ్డి

అందుకే వాడు — "ఏమ్మా? నాకు దాపణం ఇచ్చాడ్సి అప్పురం దానేస్కోమే! ఎక్కాద్దేటప్పుడ్దా పొరుపొంబు. విగాడుస్తురా. అదూ పొరు పొంబుదా! ఇంద అండ్రా కారన్‌లో పంద ఇద్దా పెరీగలాలా? తల్దా పగిల్తా పూడ్దును. మో! నాద్దా పణం ఇచ్చాడ్సి అప్పురందా పేస్కోమే!"

ఆటోవాడు వచ్చీరాని తెలుగులో విరుచుకపడుతున్నాడు

ఆటోలో చెక్క పెట్టె ఆటోలో వుండగానే —

"ఏమ్మా? అయిదు రూపాయల్దా ఇచ్చాడుస్తావా? సామ్మే! రైల్లోదా పెట్టా డుస్తును. సీట్దా సూపిస్తును. అల్లాదా సూస్తువే? ఏమ్మా? ఏపుదా సూస్తువు? సామ్మే!" కండ కంటపడ్తే దాని చుట్టూ తిరుగుతూ అరిచే కాకిలా అరుస్తా వుంది ఎర్ర చొక్కా!

మహా రద్దీగా వున్న మదరాసు సెంట్రల్ స్టేషన్ ముందర పాపం! ప్రసాద్ ఇద్దరి మధ్య ఇరుక్కొని ఊపిరి పీల్చుకోలేకుండా కాసేపు సతమతమైనాడు.

ఆ తర్వాత ఒక డీరి పెడ్డి ఇంకొక డీరి పసల పోలగాడైన్నా పోజు కొట్టకపోతే ఇవి రోజులు కావని, అవురిస్తే పేగులు లెక్క పెట్టే అరవ సోదరులు డీర గాయను నంజినట్టు నంజేస్తారని అంతవరకు అదుపులో పెట్టిన నిగ్రహానికి సెరా జనాలిచ్చి ఆహ్వానించి "ఏరా? నన్నే పనుకొని మాట్లాడ్తావుండారా మీరు? వారానికి మూడు సార్లొచ్చి ఆరుసార్లు పోతుంటాను. మదరాసంటే మనకు నీళ్ళు తాగినట్టే లెక్క! నే నెక్కడుండేదో తెలుసా మీకు? తిరుపతిలో! దినానికి మీలాంటి పుంగనూర్లను లక్ష తొంభై మందిని చూస్తుంటాను!" అని అందామనుకొన్నాడు కాని, అనినంత ధీమగానే ఒక్క చూపు విసిరినాడు ఇద్దరివైపు మార్చి మార్చి!

ఆ చూపుతోనే హైకోర్టు లైట్ హౌస్ ఎత్తుకెదిగిన అరవ సోదరులిద్దరూ అయిదడుగులు కిందికి దిగినారు — వంగితే పైకెక్కడం, పై కెక్కితే వంగిపోవడం వాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య.

అది గమనించిన ప్రసాద్ అంతవరకు చాలని తృప్తిపడి ఆటో మీటర్ వైపు చూడనట్టుగానేచూసి దేనికైనామంచిదని మీటర్ ఛార్జీ మీద ఒక్క రూపాయి అదనంగా ఇచ్చేసరికి సాహిత్య అకాడెమీ అవార్డు అందుకొన్న రచయితలా సంబర పడ్తూ ఆటోవాడు లైట్ హౌస్ ఎత్తులో నుంచి అమాంతంగా కిందపడి, పడిన దానికి నిదర్శనంగా ఆటోలో వున్న చెక్క పెట్టెను స్వయంగా దించి పక్కన పెట్టి కొసురుగా ఒక సెల్యూట్ కూడా కొట్టి ఆటోను ఫట్‌ఫట్ లాడిస్తూ తుర్రుమన్నాడు.

ఎర్ర చొక్కా గబాలున పెట్టె మీదికి వంగింది జారి నేలమీద పడిన బిడ్డను జవురు కొందామన్నంత ఆత్రంగా.

"ఏయ్! ఎందుకా తొందర! కూలి మాట్లాడు. కూలి కుదిర్తే ఆ తర్వాత చూద్దాం!" దబాయింపుగా అన్నాడు ప్రసాద్.

"తెలుంగులోనే దాయా సొప్తిని. అయిందు రూపాయిల్దా ఇవ్వుదుమే!"

"అంతేనా?"

"అయిందు పైసా తగ్గాడిస్తే నడకాదు తెలిమ్మా!"

నిటారుగా నిలిగింది ఎర్ర చొక్కా.

"అయిదు రూపాయిలకు అయిదు పైసలు తక్కువైనా కాదంటున్నావ్? తెలిసింది. నేనింకొకర్ని చూసుకొంటాను. నీ పని నువ్వు చూసుకో! తెలిసిందా?"

"తెలిం తెలింయా! ఎవుర్దా వొస్తురో నాన్ దా సూస్తును. నాకుదా నువ్వుదా ఎంద్యావేలెసెప్పుప్? అయిందు రూపాయిగ్గెడిల్లై! బెర్దమణిసి పోలేదా మాట్లాడ్తువ్!" ఎర్ర చొక్కా గొణుక్కుంటూ ముందుకు కదిలింది 'నీ కథేవిటో నేను చూడకపోతానా?' అన్న ధీమాతో.

'నీ యబ్బ లాంటోళ్ణి ఇంకొకళ్ణి చూసుకొంటాలే!' అని ప్రసాద్ ఎంతో నిర్లక్ష్యంగా చాలా సులభంగా అనగలిగినాడు కానీ అది అంత సులువైన పని కాదని అతడికీ తెలుసు.

అయిదయిదు పది బారల దూరముంటుంది ఆటో దిగిన చోటు నుంచి తాను రైలెక్క వలసిన ప్లాట్ ఫారానికి. ఆ పది బారల దూరానికే అయిదు రూపాయల కూలి అడగడమంటే అది కష్టానికి మించిన ప్రతిఫలం. అధేదో పిడికిందే లెక్క. అదే గిట్టదు ప్రసాద్‌కు.

అందుకే ప్రసాద్ ఒక్క క్షణం ఆలోచనలో పడినాడు.

తనమటుకు తాను, అయిదు రూపాయలు సంపాదించాలంటే కనీసం గంటన్నర రెండు గంటల సేపైనా వొళ్ళు వంచి పని చేయాలి. ఒక్క సైకిలు చక్రానికి గాలి కొడ్తే ఛార్జీ పది పైసలు. ఒక్క సైకిలు బాడుగకిస్తే గంటకు అర్ధ రూపాయి. ఆ వంతున కనీసం యాభై చక్రాలకు గాలైనా కొట్టాలి. లేదా అయిదారు వందల రూపాయలు విలువచేసే సైకిల్ని పది గంటలసేపు బాడుగకన్నా ఇవ్వాలి అయిదు రూపాయలు సంపాదించాలంటే! ఆ అయిదు రూపాయల్ని అయిదునిమిషాల్లో కొట్టేయాలనుకొంటున్నది ఎర్రచొక్కా.

ఇది మనిషి అశక్తత మీద, అవసరం మీద కొనసాగుతున్న ఒక రకమైన దోపిడీ! ఇది సముచితం కాదు. సమంజసం కాదు! అని అనుకొన్నాడు ప్రసాద్.

ప్రసాద్ చదువుకొన్నాడు. పదవ తరగతి వరకు చదువుకొన్నాడు. 'అణకువ, వినయము కలిగిన మంచి బాలుడు. చాలా తెలివైన వాడు' అని పేరు తెచ్చుకున్నాడు. ప్రసాద్ పై చదువులకు పోవడానికి అవకాశం లేకపోయింది! అలాఅని ప్రసాద్ నెత్తిన చేతులు పెట్టుకొని ఆలోచించ లేదు. తన ఉద్యోగాన్ని తానే ఎన్నుకొన్నాడు.

ప్రసాద్ చదువుకొంటున్న రోజుల్లో తన ఇంటి కెదురుగా ఒక సైకిల్ షాప్ వుండేది. ఏ మాత్రం తీరుబాటు దొరికినా, లేదా తనకేమీ తోచకపోయినా ప్రసాద్ వెళ్ళి ఆ సైకిల్ షాపులో కూర్చొనేవాడు. కూర్చోవడమంటే గోళ్ళు గిల్లుకొంటూ కూర్చోవడం కాదు. అక్కడ జరుగుతున్న ప్రతి పనిని చాలా శ్రద్ధగా గమనించేవాడు. అది గమనించిన షాపు యజమాని అజీజ్‌కు ప్రసాద్ మీద గురి కుదిరింది. ఆ గురి కాలక్రమేణా అభిమానంగా మారింది. అందువల్ల అజీజ్ చాలా చనువుగా, "ప్రసాద్! ఆ సుత్తిల్లా అందుకో బాబూ! ఆ కటింగ్ ప్లేయరిట్లా ఇవ్వు! రిమురను కాస్త బిగించు భయ్యా!" అని చిన్న చిన్న పనులు చేయమని పురమాయించేవాడు. చెప్పింది చిన్న పనులైనా చాలా శ్రద్ధగా చేసేవాడు ప్రసాద్. ఆ శ్రద్ధాసక్తుల్ని గమనించిన అజీజ్ ప్రసాద్‌కు సైకిల్ రిపేరు క్షుణ్ణంగా నేర్పించాడు.

పది సంవత్సరాలు తల్లిదండ్రులకొక బరువుగా, తన కొక బాధ్యతగా వెంటబెట్టిన చదువు పట్టెడు మెతుకులు పెట్టక పోయినా ఆషామాషీగా నేర్చుకొన్న సైకిల్ రిపేరు బ్రతుకొక ఆదరువయింది.

ప్రసాద్ సైకిల్ షాపు యజమాని అయినాడు. ప్రసాద్ సైకిల్ షాపు ఎప్పుడు చూసినా నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా కళకళ లాడుతూ వుంటుంది.

ప్రసాద్ వారానికి ఒకటి రెండు సార్లు స్వయంగా మద్రాసుకు వెళ్తాడు. జాగ్రత్తగా పరిశీలించి, మంచివిగా ఎంపికచేసి కాస్త చౌకగా దొరికే చోట్లోనే సైకిల్ విడి భాగాలు కొని తెచ్చుకొంటాడు. కొత్త సైకిలు కొనాలన్నా, సైకిలు రిపేరన్నా, 'ప్రసాద్ వున్నాడు కదా!' అన్న నమ్మకాన్ని, నమ్మకానికి మించిన ధైర్యాన్ని కల్పించాడు.


మనిషి అవసరాన్ని పసికట్టి అదొక బలహీనతగా భావించి అవసరానికి మించినంత గుంజుకో గలిగినవాడే అవసరం వచ్చినప్పుడు అవసరానికి మించి ఖర్చు చేయగలుగుతాడు. కానీ ప్రసాద్ పద్ధతి అది కాదు. అందుకే అంత సేపు మల్లగుల్లాలు పడుతున్నాడు.

'అతడెవర్ని పిలుస్తాడో? పిలిస్తే ఎవుడొస్తాడో? ఎవరూ రాకపోతే అతడేం చేస్తాడో? ఏమీ చేయలేనపుడు వచ్చినట్టు నన్నే పిలవాలి కదా?' అన్నట్టుగా ఎర్ర చొక్కా అల్లంత దూరంలో నిలబడి అదో రకంగా చూస్తూ నవ్వుతూ వుంది.

ప్రసాద్ అరికాలి మంట ఉచ్చికెక్కింది.

ఆలోచించేటప్పటికి ప్రసాద్‌కి వొళ్ళంతా ఆవేశం ఆవరించింది. అది అల్లా ఇల్లా ఆవేశం కాదు. తెలుగు ఆవేశం! ఆ ఆవేశంతో ఒక్క ఊపులో చెక్క పెట్టెను అవలీలగా ఎత్తుకొని భుజంమీద పెట్టుకొన్నాడు ప్రసాద్. ఎర్ర చొక్కా వెర్రిమొగం వేసి చూస్తుంటే దర్జాగా ముందుకు నడిచినాడు.


ఎర్ర చొక్కా నుంగు విడిచి కట్టిన తలపాగాను విప్పేసింది. ఆ గుడ్డతోనే నేల మీద దుమ్ము దులిపింది. అక్కడే చతికిలబడింది. ఆ తర్వాత పక్కనున్న స్తంభానికి చేరగిలపడింది.



ఒక ఘటాన పెట్టె, ఇంకొక చేతిలో సంచి—ప్లాట్‌ఫారంమీద ఠీవిగా నడుస్తున్న ప్రసాద్ ఠకీమని ఆగినాడు.

ఎదురుగా ఒక అందమైన అమ్మాయి. అంతకంటే అందమైన కనురెప్పల్ని మార్చి మార్చి ఆర్పుతున్నట్టుగా ఒక ఎర్ర దీపం ఇంకొక పచ్చ దీపం ఒకదాని తర్వాత ఇంకొకటిగా వెలుగుతూ మలుగుతూ వున్నాయ్! అదొక యాంత్రిక మైన తక్కెడ. కాకుంటే మనుష్యుల్ని తూచే కాటా.

ఆ వెయ్యింగ్ మిషన్‌ని చూస్తూ ప్రసాద్ ఎర్రచొక్కాను మరిచిపోయినాడు. కానీ ఆ స్థానంలో ఇప్పుడు లేత నీలం




రంగు చొక్కా చోటు చేసుకొనింది. ఈ మధ్య రైల్వేలో టి.టి.ఇ. లను 'కాకారాయుళ్ళ' జాబితా నుంచి తొలగించా లన్న సదుద్దేశ్యంతో కాకీ దుస్తులు మాన్పించినారు. తెల్ల నీలం రంగు చొక్కాల్ని సరఫరా చేస్తున్నారు. ఆ తెల్ల నీలిరంగు చొక్కా మనసులో మెదిలేసరికి భుజాన వున్న చెక్క పెట్టె మనసులో మెదిలింది. ఆ తర్వాత దాని తూకం మెదిలింది. ఒకవేళ ఆ చెక్క పెట్టె బరువు ముప్పై అయిదు కేజీల బరువు కంటే ఎక్కువగా వుంటే... ఎందుకొచ్చిన గొడవ? ఒకసారి తూకం వేసి చూసుకొంటే సరిపోతుంది కదా? అని అనుకొంటూ భుజాన వున్న చెక్క పెట్టెను దించినాడు. వెయ్యింగ్ మిషన్ మీద పెట్టినాడు. జేబులో నుంచి ఒక పావలా బిళ్లను తీసినాడు. ఆ పావలా బిళ్ళను ఆ యంత్రంలో నిర్దేశించిన రంధ్రంలో వేసినాడు. ఆ పావలా బిళ్ళ ఆ యంత్రంలో పడీ పడగానే ఆ యంత్రం అదొక చిత్రమైన శబ్దం చేస్తూ ఒక్క టిక్కెట్టును వెళ్ళ గక్కింది. ప్రసాద్ ఆ టిక్కెట్టును చేతికందుకొన్నాడు. తూకం ఎంతుందో చూసినాడు. సరిగ్గా ముప్పై అయిదు కేజీలే వుంది. అప్పటికి మనస్సు కుదుటపడింది.

అంతవరకు బాగానే వుంది కానీ ఆ తర్వాత అతడు వుండబట్టలేక ఆ టిక్కెట్టును తిప్పి చూసినాడు. చూస్తూ చూస్తూ అది ప్లాట్ ఫారం అన్న సంగతిని పూర్తిగా మరిచిపోయినాడు. మరిచిపోయి పడిపడీ నవ్వుతున్నాడు.

రైలెక్కడానికి హడావిడిగా పరుగెత్తుతున్నవాళ్ళు... వాళ్ళను సాగనంపడానికి వాళ్ళ వెంట పడిన వాళ్ళు... రైలు దిగిన వాళ్ళు... వాళ్ళని ఆహ్వానించడానికి వచ్చిన వాళ్లు... ప్లాట్‌ఫారం అందాల్ని ఆస్వాదించడానికి అటు ఇటు తిరుగుతున్న ప్లాట్‌ఫారం రోమియోలు... నెత్తి బరువులతో ఎర్ర చొక్కాలు... చంక బిడ్డలతో రంగురంగుల చీరలు... అక్కడొక పెద్ద మానవ ప్రదర్శన జరుగుతున్నట్టుంది. ఆ సంతలో ప్రసాద్ ఒక పిచ్చివాడులా కన్పిస్తున్నాడు — ఏకాకిగా నిలబడి పకపక నవ్వుతూంటే!

కొందరు అతన్ని చూస్తున్నారు. చూస్తూ నవ్వుకొంటున్నారు. కొందరు అదంతా పట్టించుకోవడానికి వ్యవధి లేనట్టుగా పరుగులాంటి నడకల మీద వున్నారు. ప్రసాద్ ఇదంతా గమనించే స్థితిలో లేడు. అతని లోకంలో అతడు న్నాడు.

ఆ ప్లాట్‌ఫారం మీద గందరగోళాన్ని గరళంలా మింగుతూ కొన్ని నిమిషాలు గడిచినాయో? లేదో? వున్నట్టుండి ఉలిక్కి పడినట్టు ప్రసాద్ ఈ లోకంలో పడినాడు వీపు మీద పలకరింపులా చిన్న దెబ్బ పడేసరికి!

ఎదురుగా ఏకాంబరం! ఏకాంబరం తన మిత్రుడే! తిరుపతీయుడే!

దేశం కాని దేశంలో రెండు తెలుగు మొఖాలు తారసపడ్తే! ఓహోహో! ఆహాహా! అనుకొన్నట్లు ఆ రెండు మొఖాలు ఒకదాన్నొకటి ఆ తీరులోనే విలోకించుకొన్న తర్వాత—

"ఒరే ప్రసాద్! నువ్వేంది? ఈ ప్లాట్‌ఫారం మీదేంది?

దీపావళి శుభాకాంక్షలు

# మర్చంట్స్ అసోసియేషన్ (రిజిష్టర్డు)

మార్కెట్ వీధి: కాకినాడ — 533 001

అధ్యక్షులు: ఉద్దేశి మంగయ్య

కార్యదర్శి: గుల్లపూడి సత్యనారాయణమూర్తి

పిచ్చోడిలా నవ్వడమేంది?" అన్నట్టుగా ఏకాంబరం ప్రసాద్ వైపు ఎగాదిగా చూసినాడు.

ఆ మాత్రం గ్రహించలేనివాడేం కాదు ప్రసాద్.

అందుకే మారు మాట్లాడకుండా తన చేతిలో వున్న టిక్కెట్టును ఏకాంబరం చేతికిచ్చాడు.

ఏకాంబరం టిక్కెట్టు వైపు పరిశీలనగా చూసినాడు.

"బరువు ముప్పై అయిదు కేజీలు. నీదేనా?"

"కాదు. నా పెట్టెది!"

"అయితే ఇందులో నవ్వడానికే మాత్రం అస్కారం లేదే?" అని అంటూనే ఏకాంబరం టిక్కెట్టుని తిప్పి చూసినాడు.

అప్పుడు ఏకాంబరం తన కంటే ఎక్కువేగా విరగబడి నవ్వుతాడని ప్రసాద్ ఆశించినాడు. కానీ ఆశాభంగమే అయింది. ఏకాంబరం నవ్వలేదు సరికదా? ఏదో ఏకాగ్రతలో మునిగిపోయినట్టు ముఖం పెట్టినాడు. అది కూడా రెండు మూడు క్షణాలే! ఆ తర్వాత—

"ఈ పెట్టెలో ఏముంది?" అని అడిగినాడు.

"సైకిల్ విడి భాగాలు అంటే స్పేర్ పార్ట్స్."

"అట్లా అన్నావ్ బాగుంది. అందుకే నేనంటాను మనిషికి అవగాహన లోపించినప్పుడు పిచ్చోడైపోతాడు అని."

అయ్యవారికి పేర్ల పండక్కీ సంబంధం కుదిర్చినట్టుగా ఏకాంబరం సైకిల్ స్పేర్ పార్ట్స్‌కి అవగాహనకి లంకె కుదిర్చి మాట్లాడుతుంటే ప్రసాద్ మారుమాట్లాడడానికిఅస్కారం లేకపోయింది.

"ఇప్పుడే కాదు. ఇక్కడే కాదు ప్రసాద్! ఆది నుంచి ఈ అవగాహన విషయంలో మనం పప్పులో కాలు వేస్తూనేవున్నాం. మహాత్ముడు గాంధీకి, శాంతిదూత నెహ్రూకి, మన భయ్యా జిన్నాకు అవగాహన వుండి వుంటే పాకిస్తాన్ వేరయ్యేదే కాదు. ఇప్పుడు ఖలిస్థాన్ ఉద్యమమూ వుండేది కాదు.ఏమంటావ్?"

తీగను కదిలిస్తే డొంకంతా కదిలినట్టు వ్యవహారంఎక్కడో మునిగి ఎక్కడో తేలుతుంటే ప్రసాద్ తెల్లమొఖం వేసి వింటున్నాడు.

"అను, నువ్వేన్నయినా అను. పడ్తాను. కానీ అవగాహన విషయంలో మాత్రం అడ్డం మాట్లాడ్తే పడను. పడలేను. పోనీ! అంత దూరమెందుకు? ఈ రోజుల్లో భార్యా భర్తల మధ్య అవగాహన వుందా? తండ్రీ కొడుకుల మధ్యఅవగాహన వుందా? స్నేహితుడికీ స్నేహితుడికీ మధ్య అవగాహనవుందా? అధికారికి అధికారికి మధ్య అవగాహన వుందా? పోనీ! ఇవన్నీ వ్యక్తిగత విషయాలని కొట్టిపారేద్దాం! రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య అవగాహన వుందా? మతానికి మతానికి మధ్య అవగాహన వుందా? చెప్పు? నువ్వే చెప్పు? ఏదో శక్తి ఆవహించి నట్టుగా ఏకాంబరం ఊగిపోతున్నాడు.

ఇంతసేపు తమిళవాడు స్వార్థాన్ని గురించి తలపోసుకొన్న ప్రసాద్-ఇన్ని మారణ హోమాల్ని చెవులారా వింటూ హత్యాకాండల్ని కండ్లారా చూస్తున్న ప్రసాద్— ఏమని చెప్తాడు? దీనికంతటికీ కారణం అవగాహన లేకపోవడమేనని తనకూ తెలుసు. అయితే తనకు తెలియకుండా తికమక పడుతున్నదేమంటే? తన పెట్టెలోని స్పేర్ పార్ట్స్‌కి, అవగాహనకున్న సంబంధం మేమిటా? అని.

"ఒక్కమాటంటే నీకు కోపం రాదు గదా ప్రసాద్?"

ఇన్ని మాటలంటే రాని కోపం ఇప్పుడొస్తుందా?' అన్నట్టుగా చూస్తున్నాడు ప్రసాద్.

"ఈ టిక్కెట్టుకు ఒక వైపు తూకం, ఇంకొక వైపు అదృష్టం ముద్రించి వున్నారు కదా? తూకం ముప్పై అయిదు కేజీలు సరేసరి! మరి ఆ అదృష్టం ఏమిటి?"

"త్వరలో వివాహ సమస్య తీరును అని."

"ఎవరికి నీకా?"

"కాదు నా పెట్టెకు!"

"పెట్టెకేంటి? వివాహ సమస్య తీరేందేంది? అని కదా నవ్వుతున్నావు. అక్కడే అవగాహన దెబ్బ తినిందంటున్నా!"

"అదెట్లా?"

"అసలు వివాహమంటే ఏమిటి?"

"రెండు జీవితాల్ని జత చేయడం!"

"అయితే ఈ పెట్టెలోని స్పేర్ పార్ట్స్‌ని ఏం చేస్తావు రేపు?"

"జత చేస్తాను."

"అయితే అదేమైనట్టు? ఆ మాత్రం అవగాహనలేకుండా పట్టపగలు ప్లాట్‌ఫారంమీద పిచ్చోడిలా పగలబడి నవ్వుతున్నావే? ఏదైనా అవగాహన చేసుకోవడం మీదనే ఆధారపడ్తుందయ్యా! ... రైలుకు టైం అయినట్టుంది. రారా!" అంటూ సందేహంనివృత్తికోసరం అవతరించిన సాక్షాత్ భగవంతుడు సందేహాన్ని తీర్చి అంతర్ధానమైనట్టు ఆ మరుక్షణమే మాయమైనాడు ఏకాంబరం.

ప్రసాద్ దాదాపు కొయ్యబారిపోయినాడు. ఆ తర్వాత తల ఆడించి కాళ్ళూ, చేతులు ఒకసారి విదిలించి చూసుకొని స్పృహలోనే వున్నట్టు నిర్ధారించుకొన్న తర్వాత—

"ఓహోహో! ఏకాంబరం! నీ అవగాహనాశక్తికి జోహార్లు! అవగాహన మీద ఎంత పాఠం చెప్పినావు. శాస్త్రాలు చెప్పే బల్లిలా. అదైనా కుడితిలోనే పడ్తుంది. నువ్వెక్కడ పడిపోతున్నావో నీకే అవగాహన లేదు. దేశ కాల పరిస్థితులమీద ఇంత అవగాహన కలిగిన నీవు వివాహ సమస్యను స్పేర్ పార్ట్స్‌ను జతచేయడంతో ముడిపెట్టినావంటే మన మూఢత్వానికి ఇతకంటే నిదర్శనం కావాలా?" అని ప్రసాద్ ఆలోచిస్తూంటే.

'దేశం గమ్యాన్ని గురించి సతమతమవుతున్నావ్ ఇప్పుడు నీ గమ్యం ఏమిటి!' అని హెచ్చరిస్తున్నట్టుగా రైలు కూత చెవిని పడింది. ప్రసాద్ పెట్టెను భుజాన వేత్తుకొని పరిగెత్తినట్టుగా వెళ్ళి రైలెక్కినాడు.

## బిందుమాధురి



పచ్చనాకుల అందమై
పరిమళించే బిందువై
మేఘపుత్రిక జారుతోంది
వసుధపై నిట వాలుతోంది

మెట్టతామర ముత్యమవుతూ
గుబురు రోజాపూల నవ్వయి
మొగలి రేకుల మొయిలువల్లపై
నల్లకలువల పిల్లగోవిగ
మేఘపుత్రిక జారులోంది
తల్లి పుడమిని తాకుతోంది

నీలి మేఘపు జాలి పాటై
వర్షధారకు కాలిబాటై
సొమ్మసిల్లిన తోట పచ్చకు
సొగసు లద్దిన తళుకు పూతై
మేఘపుత్రిక జారుతోంది
పృథివి పెదవిని మెరుస్తోంది

పులకలెత్తిన విత్తుగుండెను
తట్టివచ్చిన మొలక పాపకు
మొదటి ముద్దుగ గాలి విసిరిన
బిందు విదిగో చూడరండి
బిడియ పడకను జోతలిండి

— ఘంటసాల నిర్మల